ప్రజాశక్తి
బుధవారం 9 నవంబర్ 2022 5 విజయనగరం



ఇద్దరు డిఎస్‌పిలకు బదిలీ

- 'దిశ'కు వెంకటేశ్వర్లు
- పాలకొండకు కృష్ణారావు నియామకం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఇద్దరు డిఎస్‌పిలు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డిఎస్‌పిలను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా విజయనగరంలోని దిశ పోలీసు స్టేషన్ డిఎస్‌పి టి.త్రినాధరావు విశాఖ సౌత్ జోన్ ఎసిపిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పోలీసు ప్రధాన కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఎం.వెంకటేశ్వర్లు దిశ డిఎస్‌పిగా నియమితులయ్యారు. పాలకొండ డిఎస్‌పి ఎం. శ్రావణి ఇక్కడ నుంచి బదిలీ అయ్యారు. రెండేళ్ల క్రితం ఇక్కడ బాధ్యతలు చేపట్టిన ఆమె విజయవాడ మంగళగిరి కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇక్కడ డిఎస్‌పిగా జివి కృష్ణారావును నియమించారు. అయితే విజయనగరం డిఎస్‌పి పోస్టు మాత్రం ఈ బదిలీల్లోనూ భర్తీకి నోచుకోలేదు.

పట్టభద్రుల ఓటుకు 59,281 దరఖాస్తులు



- చివరి ఒక్కరోజులోనే 20,704 ఓట్లు నమోదు
- ఆశ్చర్యపోతున్న విశ్లేషకులు
- బోగస్, డబుల్ ఎంట్రీలపై అనుమానం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్లకోసం జిల్లా వ్యాప్తంగా 59,281 దరఖాస్తులు అందాయి. చివరి ఒక్కరోజే 20,704 దరఖాస్తులు నమోదు కావడం పట్ల అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. వీటిలో బోగస్, డబుల్, త్రిబుల్ ఎంట్రీలు ఉండవచ్చున్న వాదన వినిపిస్తోంది. ఒకే రోజు ఇన్ని దరఖాస్తులు నమోదు కావడం పట్ల విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 2017 పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో 29,710 ఓట్లు నమోదయ్యాయి. ప్రస్తుతం ఓటరుగా నమోదు కావడానికి 2019 అక్టోబర్ 31 తేదీ లోపు డిగ్రీ లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలని ఎన్నికల కమిషన్ పేర్కొన్న విషయం తెలిసిందే. అక్టోబర్ 1వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించిన విషయం విధితమే. ఈనెల 7వ తేదీతో గడువు ముగిసింది. ఈ కాలవ్యవధిలో మొత్తం ఆఫ్‌లైన్‌లో 32,647, ఆన్‌లైన్‌లో 26,634 చొప్పున దరఖాస్తులు అందాయి. జిల్లాలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కలిపి పరిశీలిస్తే విజయనగరం మండలం, పట్టణం నుంచి అత్యధికంగా 18,240 దరఖాస్తులు నమోదయ్యాయి. అత్యల్పంగా తెర్లాంలో 719, భోగాపురంలో 732, బాడంగిలో 773 చొప్పున దరఖాస్తులు అందాయి. చాలా మండలాల్లో ఆఫ్‌లైన్ కన్నా ఆన్‌లైన్‌లోనే ఎక్కువ దరఖాస్తులు చేయడం గమనార్హం. ఓటర్ల నమోదులో వైసిపి, టిడిపి, బిజెపి, పిడిఎఫ్ అభ్యర్థి కె.రమాప్రభను బలపర్చిన ప్రజా, ఉద్యోగ, విద్యార్థి తదితర 250 సంఘాలు పోటీ పడ్డాయి. మునుపెన్నడూ లేనంతగా పట్టభద్రుల ఓట్ల చేర్పులోనూ రాజకీయ పార్టీల జోక్యం పెరిగింది. దీంతో, ఓటు మాట ఎలా ఉన్నా సర్టిఫికెట్, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఎవరికీ కాదనకుండా అందజేశారని, మరోవైపు ఆన్‌లైన్‌లోనూ అదే పని జరిగిందని పలువురు విశ్లేషిస్తున్నారు. అందువల్లే దఖాస్తుల సంఖ్య చివరి రెండు, మూడు రోజుల్లో ఊహించని స్థాయికి చేరిందనే వాదన వినిపిస్తోంది. ఈనేపథ్యంలో దరఖాస్తుల పరిశీలన, జాబితా తయారీ విషయంలో ఎన్నికల సంఘం, జిల్లా స్థాయిలో ఎన్నికల విభాగం ప్రత్యేక దృష్టిసారించాల్సిన పరిస్థితి ఏర్పడింది.


మండలాల వారీ నమోదైన ఓటర్ల వివరాలు

మండలం	ఆన్‌లైన్	ఆఫ్‌లైన్	మొత్తం
1. వంగర	791	1070	983
2. రేగిడి	1409	172	1581
3. రాజాం	2097	983	3080
4. సంతకవిటి	1088	67	1155
5. బొబ్బిలి	1389	3273	4662
6. రామభద్రపురం	507	266	774
7. బాడంగి	405	314	719
8. తెర్లాం	479	425	904
9. మెంటాడ	322	565	887
10. చీపురుపల్లి	756	703	1453
11. మెరకముడిదాం	678	312	990
12. గుర్ల	803	531	1334
13. గరివిడి	1091	531	1224
14. గజపతినగరం	491	1070	1561
15. దత్తిరాజేరు	477	462	939
16. గంట్యాడ	992	1510	2502
17. బొండపల్లి	382	845	1227
18. నెల్లిమర్ల	1155	976	2131
19. పూసపాటిరేగ	1064	195	1259
20. డెంకాడ	709	619	1328
21. భోగాపురం	417	315	732
22. విజయనగరం	5483	12757	18,240
23. కొత్తవలస	955	1155	2151
24. జామి	512	1347	1859
25. వేపాడ	508	682	1190
26. ఎస్.కోట	744	1863	2637
27. ఎల్.కోట	512	1347	1434
మొత్తం	**26,634**	**32,647**	**59,281**

కొత్తగా వివాహమైన మహిళల కోసం

సఖి గ్రూపులు ఏర్పాటు

కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఫోర్టిఫైడ్ బియ్యం వినియోగాన్ని పెంచాలి



సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

కొత్తగా వివాహమైన మహిళలకోసం ప్రత్యేకంగా సఖి గ్రూపులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిరక్షణ, పోషకాహారం, రక్తహీనత నివారణ, గర్భం దాల్చడం, వేక్సినేషన్ తదితర అంశాల గురించి వైద్యుల ద్వారా ఈ గ్రూపు సభ్యులకు వివరించాలని సూచించారు. స్థానిక కెఎల్‌పురంలోని 54వ వార్డు సచివాలయాన్ని కలెక్టర్ సూర్యకుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయ పరిధిలోని గృహనిర్మాణ ప్రగతిపై ఆరా తీసి, అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు చేయాలని సూచించారు. ఇప్పటికీ నిర్మాణం ప్రారంభించని ఇళ్లను రద్దు చేయాలని, నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. కల్యాణమస్తు, ఆధార్ సేవలు, వేక్సినేషన్, గర్భిణులకు, బాలింతలకు పోషకాహార పంపిణీ, పిల్లలకు బరువు, ఎత్తు నమోదు, ఆయుష్మాన్ భారత్, ఆసుపత్రుల్లో ప్రసవాలు తదితర అంశాలపై ఆరా తీశారు. పిల్లల్లో రక్తహీనతను గుర్తించారు. రక్తహీనత నివారణకు, ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని వినియోగించేలా చూడాలని కోరారు. ఏడాది దాటిన పిల్లలకు మీజిల్స్ టీకాను తప్పనిసరిగా వేయించాలని సూచించారు. విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే వలంటీర్లను తొలగించాలని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో అపార్టుమెంట్లలోకి ఎఎన్ఎం, ఆశా తదితర ప్రభుత్వ సిబ్బందిని అనుమతించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అపార్టుమెంట్లలో నివాసం ఉంటున్న గర్భిణులు, బాలింతలకు వేక్సినేషన్, ప్రభుత్వ పథకాలు, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన అంశాలు చేరడం లేదని అన్నారు. ప్రభుత్వ సిబ్బందిని అనుమతించని అపార్టుమెంట్లపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, హౌసింగ్ పీడీ ఎన్‌వి రమణమూర్తి, డిఇ రంగారావు, ఎఇ శ్రీనివాసరావు, సచివాలయాల జిల్లా సమన్వయకర్త అశోక్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వారం రోజుల్లోనే వివాహ ధ్రువపత్రం

సచివాలయాల ద్వారా వారం రోజుల్లోనే వివాహ ధ్రువపత్రాన్ని పొందవచ్చని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. కల్యాణమస్తు పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి, ఇతరత్రా కూడా వివాహ సర్టిఫికేట్లు చాలా అవసరమని తెలిపారు. జరిగిన ప్రతి వివాహాన్ని రిజిష్టర్ చేయించి, సర్టిఫికేట్‌ను పొందాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 96 అర్బన్ సచివాలయాలు, 530 గ్రామ సచివాలయాల్లో వివాహ ధ్రువపత్రాలను జారీ చేయడం జరుగుతోందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో అయితే వివాహం జరిగిన 60 రోజుల్లోపు, పట్టణ ప్రాంతంలో 90 రోజుల్లోపు, తమ ప్రాంత సచివాలయంలో దరఖాస్తు చేయాలని సూచించారు. వధూవరుల ఆధార్ కార్డులు, పాస్ ఫొటోలు, పెళ్లి కార్డు, పెళ్లి ఫొటోలు, తల్లితండ్రుల ఆధార్ కార్డులు కాపీలను జతచేసి, దరఖాస్తు చేస్తే, వారం రోజుల్లోనే సర్టిఫికేట్ మంజూరు అవుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ సెక్రటరీ, మున్సిపాల్టీల్లో మున్సిపల్ కమిషనర్ సర్టిఫికేట్లను జారీ చేస్తారని తెలిపారు.

9 నుంచి అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పరీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ గణపతిరావు

ప్రజాశక్తి-విజయనగరం

ఎపిపిఎస్‌సి నిర్వహిస్తున్న అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పరీక్ష ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకు జరుగుతుందని జిల్లా రెవిన్యూ అధికారి గణపతి రావు తెలిపారు. ఈ పరీక్ష గాజులరేగలో గల సత్య ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతుందని తెలిపారు. ఉదయం 9.30 నుండి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 5 గంటల వరకు రెండు పూటలా జరుగుతుందని, 11వ తేదీన ఉదయం ఒక్క పూటే జరుగుతుందని తెలిపారు. పరీక్ష ఏర్పాట్ల పై డి.ఆర్.ఓ మంగళవారం సంబంధించిన అధికారుల తో సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగేలా చూడాలని కళాశాల యాజమాన్యానికి, పోలీస్ యంత్రాంగానికి సూచించారు. 340 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, పరీక్ష కేంద్రంలో అవసరమైన ఇంటర్నెట్ కనెక్షన్, సీటింగ్ ప్లాన్ ఉండేలా చూడాలన్నారు. అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.సమావేశంలో ఎపిపిఎస్‌సి నుంచి వచ్చిన ప్రతినిధులు, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్, రెవిన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుకు కృషి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే విధంగా కృషి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సూచించారు. మంగళవారం పరిశ్రమల అభివృద్ధి మండలి రాష్ట్ర డైరెక్టర్ సంగం రెడ్డి బంగారు నాయుడు సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి, పరిశ్రమల ఏర్పాటు , ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా కృషి చేయాలని సూచించారు. పార్టీ పరంగా యువజన విభాగాన్ని మరింత పటిష్ట పరచాలన్నారు. రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాధ్‌ను, ఇండస్ట్రియల్ చీఫ్ సెక్రటరీ కరికాలవన్‌ను, పలువురు పారిశ్రామికవేత్తలను కూడా బంగారు నాయుడు కలిశారు.

ఎపిసిపై చర్యలు తీసుకోండి

మంత్రి బొత్స, ఎస్‌పిడి, కలెక్టర్‌కు లేఖ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల జిల్లా విద్యా వ్యవస్థలో ముఖ్యంగా సమగ్ర శిక్షలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఎపిసిపై చర్యలు తీసుకోవాలని కన్జ్యూమర్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు ఎంఎస్ శ్రీనివాసరావు రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణకు, ఎస్‌పిడికి, కలెక్టర్‌కు లేఖ రాశారు. ఆ లేఖను మంగళవారం పత్రికలకు విడుదల చేశారు. జిల్లాకు మంచి పేరు తెచ్చే అధికారులతో పనులు చేయించాలని, చెడ్డ పేరు తెచ్చే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. కొందరు అధికారులు స్వార్ధంతో చేస్తున్న అవినీతి, అక్రమ పనులు ద్వారా జిల్లాకి చెడ్డ పేరు వస్తోందని తెలిపారు. ఆ లేఖతో పాటు గత రెండు రోజులుగా ప్రజాశక్తి లో వచ్చిన కథనాలను ఆ లేఖతో పంపినట్లు తెలిపారు

నేడు విద్యాశాఖ మంత్రి బొత్స రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం జిల్లాకు రానున్నారు. 9వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు విశాఖలో బయలుదేరి సాయంత్రం 5 గంటలకు నగరానికి చేరుకుంటారు. 5 గంటలకు ఎస్‌విఎన్‌నగర్ లోని సుజాత ఫంక్షన్ హాల్ లో జరిగే విజయనగరం నియోజకవర్గం పార్టీ కేడర్ సమావేశంలో పాల్గొంటారు. 10వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఎస్.కోట మండలంలో దబ్బగెడ్డ నుంచి పల్లపు దుంగాడ గ్రామం వరకు పిఎంజిఎస్‌వై నిధులతో చేపట్టనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. 11 గంటలకు కిల్తంపాలెంలో గ్రామ సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తారు.

రేపు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ఆర్థిక సంస్థ (ఎపిఎస్‌ఎఫ్‌సి) విజయనగరం బ్రాంచి ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన పారిశ్రామిక, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎపిఎస్‌ఎఫ్‌సి విజయనగరం బ్రాంచి మేనేజరు ఎస్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విటి అగ్రహారంలో గల ఎపిఐఐసి బిల్డింగు ప్రాంగణంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపిఐఐసి జోనల్ మేనేజరు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు, ఎపిఎస్‌ఎఫ్‌సి అసిస్టెంట్ జనరల్ మేనేజరు హాజరవుతారని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు పాల్గొనాలని కోరారు.

రాష్ట్రపతిని కలిసిన సిటియు విసి

ప్రథమ స్నాతకోత్సవానికి ఆహ్వానం



రాష్ట్రపతికి పుష్పగుచ్చం అందజేస్తున్న విసి కట్టమణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గిరిజన సామాజిక వర్గం నుంచి దేశంలోనే అత్యంత ఉన్నతమైన రాజ్యాంగ పదవిని పొందిన మహిళ ద్రౌపది ముర్ము అని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ టివి కట్టిమణి అన్నారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును ఆయన ఢిల్లీ రాష్ట్రపతి భవనం లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలను తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన విశ్వవిద్యాలయ ప్రథమ స్నాతకోత్సవానికి ముఖ్య అతిధిగా (సందర్శకుని హోదాలో) రావాలని ఆహ్వానించారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా విసి కట్టిమని రాష్ట్రపతికి కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం స్థితిగతులను వివరించారు, అనంతరం గిరిజనుల విద్యకు సంభందించిన వివిధ సమస్యలు,వివిధ పరిష్కార మార్గాలకు సంభందించిన అంశాలు చర్చకు వచ్చాయని విసి తెలిపారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ద్వారా గిరిజన విద్యార్థులకు చేకూరాల్సిన వివిధ ప్రయోజనాలు చర్చకు వచ్చాయని ప్రొఫెసర్ కట్టిమని తెలిపారు.

రబీకి మడ్డువలస నీరు

విజయనగరం : వచ్చే రబీ సీజన్లో జిఎస్ఎన్ఎస్ మడ్డువలస ప్రాజెక్టు ద్వారా పదివేల ఎకరాల్లో పంటలు వేసేందుకు సాగునీటిని సరఫరా చేయనున్నట్టు ప్రాజెక్ట్ కార్యనిర్వాహణ ఇంజినీర్ హెచ్. మన్మధ రావు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని నాలుగు మండలాల పరిధిలో రబీలో మొక్కజొన్న సాగుకు నీటిని అందిస్తామని పేర్కొన్నారు. విజయనగరం పరిధి వంగరలో 996, రేగిడి ఆమదాలవలసలో 4074, సంతకవిటిలో 3016 ఎకరాలకు, శ్రీకాకుళం జిల్లాలో జి.సిగడాం మండల పరిధిలోని 1,914 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే చర్యలు చేపడుతున్నట్టు ఇఇ తెలిపారు. దీనికోసం 1.16 టిఎంసిల నీరు ఆయకట్టుకు అందిస్తామని పేర్కొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

రూ.1.20కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని వివిధ డివిజన్లలో కోటి 20 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మంగళవారం 8, 28, 11, 13, 15, 20 ,22 డివిజన్లలో కాలువలు, కల్వర్టులు, రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు శరగవేగంగా సాగుతున్నాయన్నారు. గతంలో అభివృద్ధికి నోచుకోని నగరంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రత్యేక దృష్టి సారించి అన్ని డివిజన్లలోనూ అవసరమైన అభివృద్ధి, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జకీర్ హుస్సేన్, పలు డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్ సేవలు ఎనలేనివి

పజా శ్రేయస్సే లక్ష్యంగా పట్టణ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సేవలు ఎనలేనివని రోటరీ సెంట్రల్ సభ్యులు కొనియాడారు. మంగళవారం రోటరీ సెంట్రల్ సభ్యులు కోలగట్లను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల కషితో, నగరపాలక వర్గం అనుమతితో మంజూరు చేసిన పాత టూటౌన్ పోలీస్ స్టేషన్ భవనాన్ని రోటరీ సెంట్రల్ కు కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ భవనంలో త్వరలో డయాలసిస్ సెంటర్, కంటి ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. రోటరీ చేసే ప్రతి ప్రజాహిత కార్యక్రమానికి తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అన్నారు.

కోలగట్లను కలిసిన వారిలో రోటరీ సెంట్రల్ ప్రతినిధులు కేజీ అగర్వాల్, సిఎ నాగేశ్వరరావు, మడిపల్లి రామారావు, టిఎల్ఎన్ మూర్తి, డాక్టర్ పూసర్ల గోపాలరావు, డాక్టర్ సునీత, మోటుమర్రి శ్రీనివాసరావు, పూసర్ల మారుతీ ఉన్నారు.

చెమటను చిందిస్తూ.. కుటుంబాలను నెట్టుకొస్తూ...

- అష్టకష్టాలు పడుతున్న వ్యవసాయ కార్మికులు
- కూలిరేట్లు పెంచాలని సుదీర్ఘపోరాటం
- యాంత్రీకరణతో తగ్గిన వ్యవసాయ పనులు
- ఏటా తప్పని వలసలు
- నేడు వ్యవసాయ కార్మిక సంఘం మన్యం జిల్లా మహాసభ



సాగు భూములకు పట్టాలివ్వాలని ఆందోళన చేస్తున్న వ్యవసాయ కార్మికులు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వ్యవసాయరంగంలో రైతు పాత్ర ఎంత కీలకమో, సాగులో తోడ్పాటునందిస్తున్న వ్యవసాయ కార్మికుల పాత్ర కూడా అంతే కీలకం. కానీ వారంతా చెమటను చిందిస్తూ... కుటుంబాలను నెట్టుకొస్తూ... జీవన పోరాటంలో అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి కష్టజీవులకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా నిలుస్తోంది. పనులు కల్పించాలని, కూలిరేట్లు పెంచాలని, వారి కోసం ఉన్న కొద్దిపాటి హక్కులనైనా అమలు చేయాలని నిరంతరం పోరాడుతోంది. ఈ నేపథ్యంలో మక్కువ మండల కేంద్రంలో బుధవారం జరగనున్న 9వ జిల్లా మహాసభకు ప్రాధాన్యత సంతరించుకుంది. 2009 సెప్టెంబర్ 5న సీతానగరంలో 8వ మహాసభ జరిగింది. నాటి నుంచి నేటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, వాటి పర్యావసానాల వల్ల వ్యవసాయ కార్మికులకు జరిగిన కష్టనష్టాలు, వాటిపై సంఘం తరపున చేసిన పోరాటాలు, ఎదురైన అనుభవాలు, విజయాలు చర్చించుకుని, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించు కునేందుకు నేటి మహాసభ దోహదపడనుంది.

జిల్లాలో చెరకు, గోగు పంటలు అంతరిస్తున్నాయి. వాటి స్థానంలో పత్తి, మొక్కజొన్న, పామాయిల్, అరటి పంటలు విస్తరించాయి. వాణిజ్య పంటలు విస్తరించడం, ముఖ్యంగా వరిసాగులో యాంత్రీకరణ పెరగడం వంటి కారణాల వల్ల వ్యవసాయ కూలీలకు పని దినాలు తగ్గిపోతున్నాయి. వ్యవసాయ పనుల కోసం ఐదు కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల వరకు ఆటోలపై ప్రయాణించడమే ఇందుకు తార్కాణం. జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో బాగా చదువుకున్న యువతీ, యువకులు కూడా ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత వ్యవసాయ కూలీల్లో ఆత్మస్థైర్యం పెరిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాల వల్ల శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదు. రెండేళ్ల క్రితంతో పోలిస్తే రోజువారీ కూలి రేట్లు తగ్గాయి. పనిదినాలు పెంచాలని సంఘం తరపున పోరాడుతున్నా కేంద్రం తనకు పట్టనట్టుగా వ్యవహరిస్తోంది. ఈ ఏడాది కేంద్రం మార్చిన సాఫ్ట్‌వేర్ వల్ల కూలీలకు నష్టం జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని ప్రశ్నించడం లేదు. ఉపాధి కూలీలకు ఆదాయం పెంచుతామంటూ ఉత్తుత్తి ప్రగల్భాలాలు పలుకుతోంది. రెండు పూటలా పనిచేయాలన్న నిబంధన, వేసవి అలవెన్సుల తొలగింపు వంటివి మరింత ఇబ్బందికరంగా మారాయి. దీనిపై సంఘం తరపున బలిజిపేట, సీతానగరం, మక్కువ, సాలూరు, కొమరాడ, పార్వతీపురం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో ఆందోళనలు జరిగాయి.

జిల్లాలో లక్షల ఎకరాలు అసైన్డ్ భూమి, ప్రభుత్వ భూమి, అటవీ పోడు భూమి ఉంది. సాగు చేస్తున్న పేదలకు, గిరిజనులకు, దళితులకు, ఇప్పటికీ పట్టాలు ఇవ్వలేదు. సాలూరు, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం, కొమరాడ మండలాల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పెత్తందారులు కొంత భూమిని ఆక్రమించుకున్నారు. వాటిని పేదలకు పంచాలని సంఘం పోరాడింది. గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం ఒక కుటుంబానికి 10 ఎకరాల వరకూ పోడు పట్టాలు ఇవ్వాలంటూ చేపట్టిన పోరాటం సుదీర్ఘకాలంగా సాగుతోంది. చాలా చోట్ల గిరిజనులకు పట్టాలు ఇప్పించడంలో సంఘం పాత్ర ఎనలేనిది. సాలూరు, మక్కువ, పార్వతీపురం, పాచిపెంట, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల్లో భూ సమస్యలపై పోరాటం జరుగుతోంది. సాలూరు మండలం బోరబందలో 50 ఎకరాలు, జిల్లేడు వలసలో 35 ఎకరాలు, పాచిపెంట మండలంలో 748 ఎకరాలు పేదలకు ఇవ్వాలని చేపట్టిన పోరాటం కొనసాగుతుంది. మక్కువ మండలం వెంకంపేటలో 20 ఎకరాలు, పుల్లేరువలసలో 8 ఎకరాలు, మోసూరువలసలో8 ఎకరాలు, ఎస్.పెద్దవలసలో 13 ఎకరాలు పోరాడి పేదలకు, గిరిజనులకు ఇప్పించారు. పార్వతీపురం మండలం లచ్చన్నదొర వలసలో 60 ఎకరాలు, రావికోన పంచాయతీలో 50 ఎకరాలపై పోరాడుతున్నారు. కొమరాడ మండలం పెద్ద శాఖ లో 18 ఎకరాలు, సీసాడవలసలో 28 ఎకరాల అటవీ భూమిని గిరిజనులకు పోరాడి పట్టాలి ఇప్పించారు. జియ్యమ్మవలస మండలంలో కొండనిడగల్లు, చినదొడిజ,జబల్లేరు, కిడిగేసు, పెద్దొడిజ, నడిమిసిరిపి గ్రామాల్లో గిరిజనులకు 200 ఎకరాల అటవీ భూమి కోసం పోరాడి పోడుపట్టాలు సాధించారు. అలమండ , చంద్రశేఖరరాజపురం, గడసింగపురం, గ్రామాల్లో సుమారు 200 ఎకరాల భూమి బంజరు సాగు చేస్తున్న పేదలకు పట్టాల కోసం సంఘం పోరాడుతోంది.

మరోవైపు భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌పై సంఘం నిరంతర పోరాటాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న మహాసభలు విజయవంతం కావాలని రైతాంగం ఆకాంక్షిస్తోంది.

పాఠశాలను పరిశీలించిన జెసి

డెంకాడ: మండలంలోని అక్కివరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను జెసి మయూర్ అశోక్ మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు ఫేజ్ 2 పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. టాయిలెట్, ఎలక్ట్రికల్ పనులు, మేజర్ మైనర్ రిపేర్లు, ఫ్లోరింగ్ పలకలు, డైనింగ్ హాల్, డ్రింకింగ్ వాటర్, అదనపు తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి స్వామినాయుడు, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంఇఒ రమణమ్మ, సర్పంచ్ కిరణ్, మాజీ జిల్లా ప్రాదేశిక సభ్యులు సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, పేరెంట్ కమిటీ చైర్మన్ లక్ష్మీ సభ్యులు పాల్గొన్నారు.

చేయూత లబ్ధిదారుల జాబితా పరిశీలన

వేపాడ : స్థానిక వల్లంపూడి గ్రామ సచివాలయంలో మంగళవారం వైయస్సార్ చేయూత, అమ్మఒడి లబ్ధిదారుల జాబితాను ఎంపిడిఒ బిఎస్ఎన్ పట్నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెల్ఫేర్ అసిస్టెంట్‌తో మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ చేయూత, అమ్మఒడి అందేలా చూడాలన్నారు. జాబితా తయారు విషయంలో ఫిర్యాదు వస్తే అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనలో వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

రామ స్వామి ఆలయం మూసివేత

నెల్లిమర్ల : రామతీర్థం రామ స్వామి దేవాలయాన్ని మంగళవారం చంద్ర గ్రహణం సందర్భంగా మూసివేశారు. ఈ సందర్భంగా అర్చకులు చంద్ర గ్రహణం కారణంగా శ్రీరామచంద్ర స్వామి వారి నిత్య కైంకర్యలు, మహా నివేదన ముగించి దేవాలయం మూసివేశారు. తిరిగి గ్రహణానంతరం రాత్రి 7గంటలకు దేవాలయం తెరిచి సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి తిరిగి యధావిధిగా భక్తులకు దర్శనం అనుమతిస్తామని తెలిపారు.

ఘనంగా గురునానక్ జయంతి వేడుకలు

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా గురునానక్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవ రావు అధ్యక్షత వహిస్తూ గురునానక్ మొదట లోడి వంశం కొలువులో ఉద్యోగం చేశారని కబీర్ బోధనల వల్ల ప్రభావితుడై భక్తి ఉద్యమంలోకి ప్రవేశించాడని అతను సిక్కు మతాన్ని స్థాపించాడని తెలియజేశారు. చరిత్ర ఉపన్యాసకులు వల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ గురునానక్ 1469లో పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో తలవండి గ్రామంలో జన్మించాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం కే వాసుదేవరావు, కే శ్రీలక్ష్మి, బి సంధ్యారాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

పట్టణంలో కమిషనర్ పర్యటన

బొబ్బిలి : మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం మల్లంపేట రైల్వే అండర్ బ్రిడ్జి, ద్వారకానగర్ కాలనీలో పర్యటించారు. రైల్వే అండర్ బ్రిడ్జిలో నిల్వ ఉండే నీటిని తోడే పంపు షెడ్‌ను పరిశీలించారు. ద్వారకా నగర్ లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంపై వెంటనే అక్కడ ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించాలని పారిశుధ్య కార్యదర్శికి ఆదేశించారు. ఆయనతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్, పర్యావరణశాఖ ఇంజినీర్ ఉన్నారు.

టుబుశ్రీ ప్రతిభ


టుబుశ్రీ

మెరకముడిదాం : జెఇఇ మెయిన్స్ 2022 పరీక్షల్లో మండలంలోని గాతాడ గ్రామానికి చెందిన గవిడి టుబుశ్రీ 1086వ ర్యాంకు సాధించి తిరుచురాపల్లి నిట్‌లో కంప్యూటర్ సైన్సు విభాగంలో సీటు పొందింది. ఈమె విశాఖలోని బోయపాలెం శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదువుకుంది. ఆమె తండ్రి ప్రముఖ కవి గవిడి శ్రీనివాస్ సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. ఎన్ఐటిల్లో మొదటి స్థానంలో ఉన్న తిరుచురాపల్లిలో టుబుశ్రీ సీటు సాధించడం పట్ల పలువురు అభినందించారు.

పిజిస్టార్‌లో ఉచిత వైద్యసేవలు

విజయనగరం : నగరంలోని రామానాయుడు రోడ్డులోగల పిజి స్టార్ ఆస్పత్రిలో మూడు రోజులు పాటు నిర్వహించిన ఉచిత హైడ్రోసెల్, హెర్నియా వైద్య శిబిరం మంగళవారంతో ముగిసింది. ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ ఎస్‌వి రమణ, డాక్టర్ ఎస్.నవీన్ ఆధ్వర్యాన పలువురు రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. 78 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు.

అయ్యన్నను కలిసిన టిడిపి నాయకులు

బొబ్బిలి: మాజీ మంత్రి, టిడిపి నాయకులు అయ్యన్నపాత్రుడిని మంగళవారం బొబ్బిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు నర్సీపట్నంలోని తన నివాసంలో కలిశారు. ఇటీవల సిఐడి అధికారులు అయ్యన్నపాత్రుడిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఇంటికి చేరుకున్న ఆయనను కలిసి సంఘీభావం తెలిపారు.

విజ్ఞాన్ని పెంచేందుకు సాహిత్యం దోహదం

బొబ్బిలి : విజ్ఞానాన్ని పెంచేందుకు సాహిత్యం దోహదం చేస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. బాలసాహిత్యవేత్త ఎన్‌విఆర్ సత్యనారాయణమూర్తి రచించిన పుస్తకాలను శాఖ గ్రంథాలయానికి వితరణ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు సాహిత్యం ఎంతో దోహదం చేస్తుందన్నారు. గ్రంథీలయంలో పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. సత్యనారాయణమూర్తి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బాలసాహిత్య వేత్త సత్యనారాయణమూర్తి, నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్, ఎల్.వాసు, తదితరులు పాల్గొన్నారు.

బిఎఫ్ఐతో సెంచూరియన్ ఒప్పందం

నెల్లిమర్ల : న్యూఢిల్లీలోని బ్రిలియంట్ ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ (బిఎఫ్ఐ) సంస్థతో సెంచూరియన్ విశ్వ విద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, బిఎఫ్ఐ సంస్థ డైరెక్టర్ ఆదర్శ మిశ్రా వర్చువల్ విధానంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా సెంచూరియన్‌లో బిఎస్‌సి ఫోరెన్సిక్ సైన్స్ కోర్సు చదువుతున్న విద్యార్థుల పరిశోధనకు ఇంటెర్న్ షిప్, ప్రాజెక్టులకు, పరస్పర జ్ఞాన మార్పిడి, కార్యశాలల నిర్వహణ, అతిధి ఉపన్యాసాలు తదితర వాటికి దోహద పడుతుందని విసి తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్ డాక్టర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, ఫోరెన్సిక్ విభాగాధిపతి విలాస్ చవాన్, డాక్టర్ నాగ, అమూల్య రత్న బెహర, ప్రవల్లిక పాల్గొన్నారు.

నేడు న్యాయ సేవ దినోత్సవ ర్యాలీ

శృంగవరపుకోట : న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, కార్యదర్శి కేవీఎస్ రామరాజుతో కలిసి ఆమె మాట్లాడారు. ర్యాలీలో అందరూ భాగస్వాములు కావాలని న్యాయవాదుల సంఘ అధ్యక్ష, కార్యదర్సులు కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మండా కామేశ్వరరావు, ఎం.దుర్గాప్రసాద్, బి.త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన యువకుడు మృతి

గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు

భోగాపురం : మండలంలోని చేపల కంచేరులో పాత కక్షలు నేపథ్యంలో ముక్కాం గ్రామానికి చెందిన వాసుపల్లి ఎల్లాజీ అనే యువకుడిపై దాడి చేసిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయపడిన ఆ యువకుడు విశాఖలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. దీంతో యువకుడి కుటుంబ సభ్యులు, స్నేహితులు మృదేహాన్ని చేపలకంచేరు తీసుకువెళ్లి ఖననం చేస్తామని మంగళవారం పట్టుపట్టారు. దీంతో ఎస్ఐ కృష్ణమూర్తి విశాఖ వెళ్లి వారికి నచ్చజెప్పి అక్కడే ఖననం చేయించారు. ఆయా గ్రామాల్లో పోలీసులు పికెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు.

ఎఎంసి చైర్‌పర్సన్ భర్త మృతి

వేపాడ : మండలంలోని నీలకంటి రాజపురం అగ్రహారానికి చెందిన ఎఎంసి చైర్ పర్సన్ మూకల కస్తూరి భర్త మూకల అప్పల సత్యం నాయుడు(50) అనారోగ్యంతో మృతి చెందారు. అనారోగ్యానికి గురైన ఆయన గత కొంత కాలంగా విశాఖ డెయిరీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. భార్య కస్తూరి ప్రస్తుతం కొత్తవలస ఎఎంసి చైర్‌పర్సన్ ఉన్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.


అప్పల సత్యంనాయుడు

మూడేళ్లగా మొండి గోడలే

- పూర్తికాని సచివాలయాల నిర్మాణాలు
- అద్దె భవనాల్లోనే నిర్వహణ
- నిధులు లేక నీరసం..ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి- రేగిడి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థకు బాలరిష్టాలు తప్పలేదు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి మూడేళు గడిచినా ఇంకా పూర్తి స్థాయి భవనాలు అందుబాటులో లేక సిబ్బంది వసతి కష్టాలు పడుతున్నారు. కొన్ని చోట్ల భవన నిర్మాణాలకు భూమి పూజ చేసి వదిలేయగా, మరికొన్ని చోట్ల మొండి గోడలతోనే నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తి కావస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో సిబ్బంది అద్దె కొంపల్లోనే విధులు నిర్వహిస్తున్నారు.

మండలంలో 25 సచివాలయాలున్నాయి. ఖండ్యాం, ఉణుకూరు గ్రామ సచివాలయాలకు నేటి వరకు భూమి పూజ చేయలేదు. 17 సచివాలయాలు నిధులు లేక అసంపూర్తిగా మధ్యలో నిలిచిపోయాయి.



అద్దె భవనంలో నడుస్తున్న సోమరాజుపేట సచివాలయం

సరసనాపల్లి, సోమరాజుపేట, ఉంగరాడ, తోకలవలస, వెంకంపేట, మునకలవలస గ్రామ సచివాలయాలు పూర్తయినప్పటికీ బిల్లులు చెల్లించక ప్రారంభానికి నోచుకోలేదు. సచివాలయాలకు అదనంగా 20 శాతం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే గాని పూర్తిస్థాయిలో సచివాలయాల నిర్మాణాలు జరగవని కరాఖండీగా కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఈ తంతు విజయనగరం జిల్లాలో 27 మండలాల్లో కనిపిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి సచివాలయ నిర్మాణాలకు నిధులు సమకూర్చి పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టాలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.

ధర పెరగడం కూడా కారణమే..

రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క సచివాలయానికి రూ.40 లక్షలు మంజూరు చేసింది. 2019-20కి సంబంధించి నిర్మాణాలు చేపడితే వాటి వ్యయం సరిపోయేది. నిర్మించిన వాటికి బిల్లులు చెల్లించకపోవడంతో పనుల్లో జాప్యం జరిగి మూడేళ్లు గడిచిపోయింది. దీంతో మెటీరియల్ ఖర్చు పెరగడంతో నిర్మాణాలు ముందుకు సాగ లేదు. కొంత మంది తెగించి అప్పులు చేసి నిర్మాణాలకు ముందుకొచ్చినా పని చేసిని వాటికి కూడా బిల్లులు ఇవ్వకపోవడంతో గ్రామస్థాయి కాంట్రాక్టర్ చితికిపోతున్నాడు. ప్రస్తుతం నిర్మాణాలు చేపడితే వచ్చిన నిధులకు 20 శాతం అధనంగా నిధులు కావాల్సి ఉందని చెబుతున్నారు. ఇలా నిధులు ఇస్తే గాని పూర్తిస్థాయిలో సచివాలయ నిర్మాణాలు జరగవని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ధరలు పెరిగిపోవడంతో నిర్మాణాలకు వెనుకడుగు వేయడంతో సచివాలయ నిర్మాణాలు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. దీంతో సచివాలయాలు అద్దె కొంపల్లోనే కొనసాగుతున్నాయి. 13 శాఖలకు సంబంధించి ఉద్యోగులు ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తూ నానా అవస్థలు పడుతున్నారు.


బిల్లులు చెల్లించకపోవడంతో ప్రారంభకాని సంకిలి సచివాలయం

నిర్మాణాలు చేపట్టిన వెంటనే బిల్లులు చెల్లిస్తాం

కొత్తగా సచివాలయాలు నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్‌కు తక్షణమే బిల్లులు చెల్లిస్తాం. గత మూడేళ్లలో బిల్లులు చెల్లింపులో సాంకేతిక పరమైన సమస్యలు ఏర్పడ్డాయి. 2019-20లో సచివాలయాలు మంజూరైనప్పటికీ మూడేళ్లలో నిర్మాణం చేపట్టి నిధులు చాలని కాంట్రాక్టర్లకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బిల్లులు చెల్లిస్తాం. అసంపూర్తిగా ఉన్న సచివాలయాలను త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలి.


రామకృష్ణ, మండల జెఇ, రేగిడి

కూలేందుకు సిద్ధంగా ప్రభుత్వ భవనాలు

ప్రజాశక్తి - వంగర

మండలంలో వివిధ శాఖల్లో ఉన్న ప్రభుత్వ భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని ఆయా ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

శివ్వాం గ్రామంలో ఉన్న పిఎసిఎస్ భవనం గత కొన్నేళ్లుగా శిధిలా వస్థకు చేరుకొని ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం ఈ కార్యాలయ సేవలు మండల కేంద్రం వంగరలో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అందువల్ల


కూలేందుకు సిద్ధంగా ఉన్న శివ్వాం పిఎసిఎస్ భవనం

అందులో పని చేసిన ఉద్యోగులు ఈ కార్యాలయ పనులు కోసం వెళ్లిన ప్రజలు అద్దె భవనంలో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పిఎసిఎస్ పాత భవనాన్ని తొలగించి దాని స్థానంలో నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు.

వంగరలో ఉన్న సివిల్ సప్లయ్ గోదాం శిధిలా వస్థలో ప్రమాదకరంగా ఉంది. ఇందులో ఎటువంటి సరుకులు లేకపోయిన ఖాళీగానే ఉన్నప్పటికీ ఈ భవనం కూడా ఎప్పుడు కూలు పోతుందో తెలియని పరిస్థితి. ఈ భవనం చుట్టూ తహశీల్దార్, వెలుగు, మండల పరిషత్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాలకు నిత్యం ప్రజలు వస్తూ వెళ్తూ, ఉంటారు అయితే వాటి మధ్యలో ఈ భవనం ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని అధికారులు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు.

గొర్లె శ్రీరాములనాయుడు మడ్డువలస ప్రాజెక్టు సమీపంలో ఉన్న అతిథి గృహం గత కొన్నేళ్లుగా శిథిల వస్థలో ఉండటంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో ఉంది. ఈ భవనం ఇక్కడ నిర్మించినప్పుడు నుంచి వంగర మండలానికి అతిథులు ఎవరు వచ్చిన ఎంతో

పట్టించుకోని అధికారులు


శిధిలావస్థకు చేరిన మడ్డువలస అతిథి గృహం

కూలేందుకు సిద్ధంగా ఉండటం వల్ల అతిథులు ఎవరు వచ్చినా భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ భవనం స్థానంలో మరో భవనాన్ని నిర్మిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, పాలకులు స్పందించి శిధిలావస్థలో ఉన్న ఈ భవనాలను తొలగించి వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పూసపాటిరేగ : అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ ఉద్యోగులతో పాటు వాలంటీర్లు అప్రమత్తంగా చూడాలని ఎంపిడిఒ జి. రామారావు తెలిపారు. మంగళవారం మండలంలోని చింతపల్లి సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలుతో పాటు ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్ బర్రి ముసలి, మత్స్యకార సొసైటీ జిల్లా అధ్యక్షులు బర్రి చిన్నప్పన్న, వైసిపి నాయకులు బర్రి దాసు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం, కొమిరి గ్రామాల్లో వరి పంటలను మంగళవారం ఎఒ గిరడ మురళీకృష్ణ పరిశీలించారు. ఈ రెండు గ్రామాల్లో దాదాపు 1100 ఎకరాల వరకు వరి సాగు చేసినట్లు తెలిపారు. వరి పంటలలో తెగుళ్ల బెడద అంతగా లేదని అన్నారు. పంటలు ఆశాజనకంగానే ఉన్నాయని వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంట కోత ప్రయోగాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 5x5లో పంట కోత ప్రయోగాలు నిర్వహించి ఎకరానికి ఎన్ని బస్తాలు వస్తాయో అంచనా వేయనున్నట్లు తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి- రేగిడి

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, గౌరవ వేతనం రూ.10వేలకు పెంచాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. ఉంగరాడ మెట్ట వద్ద మంగళవారం పాఠశాలల స్వచ్ఛ దూతలతో సమావేశం నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులకు అతి తక్కువ గౌరవ వేతనం ఇచ్చి ఎక్కువ పని చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2017 నుండి పని చేసినా కనీసం కార్మికులుగా గుర్తించని పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శానిటేషన్ కార్మికుల ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించక పోవడంతో తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గౌరవ వేతనం పేరుతో అతి తక్కువ వేతనాలు ఇచ్చి తీవ్రంగా శ్రమదోపిడి చేస్తుందన్నారు. ఆరోగ్యం బాగో లేకపోయినా కనీసం సెలవులు ఇచ్చిన పరిస్థితి కూడా లేదని, ఉదయం 8 నుండి సాయంత్రం 4 వరకు స్కూల్లోనే బందీలుగా పని చేయాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతన పెంపుదల చేసి, బకాయి వేతనాలు వెంటనే విడుదల చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్నమ్ముడు, స్వప్న, లత, రాములమ్మ, చంద్రకళ, లక్ష్మి, అనసూయ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- జామి

రాష్ట్రంలో ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అందులో భాగంగానే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎస్‌కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని చింతాడ గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. ప్రతి ఇంటికీ వస్తున్న పథకాలను పరిశీలించి, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. పలువురు మహిళలతో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్థికంగా సహాయ పడాలనే ఆలోచనతో చేదోడు, చేయూత, కాపునేస్తం వంటి పథకాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గొర్లె సరయు, ఎంపిపి అరుణ, గ్రామ మండల వైసిపి కన్వీనర్ గొర్లె రవికుమార్, సర్పంచ్ అప్పాన సుబ్రమణ్యం, ఎంపిడిఒ ఎం.సతీష్, తహశీల్దార్ జె.హేమంత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న సర్పంచ్ సుబ్రమణ్యం

తీరంలో సందడే.. సందడి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

కార్తీక పౌర్ణమితో పాటు చంద్రగ్రహనం కారణంగా శెలవుదినం కావడంతో మంగళవారం చింతపల్లి సముద్రంలో పర్యాటకులు తాకిడి పెరిగింది. జిల్లా నలుమూలల నుండి వందలాది మంది పర్యాటకులు తీరానికి చేరుకొని సముద్ర స్నానాలు ఆచరించారు. ఇసుక తిన్నలపై కేరింతలు కొట్టారు. మత్స్యకారులు వేటాడి తెచ్చిన చేపలను పట్టుకొని ఆనందం వ్యక్తం చేశారు. పిక్నిక్ సందర్భంగా సముద్రంలో ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలూ జరగకుండా మెరైన్ ఎస్ఐ రమేష్ అధ్వర్యంలో తీరంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసం రోజులు కావడంతో ప్రతి రోజు భక్తులు, పర్యాటకులు తాకిడి ఎక్కువవుతొందన్నారు. రానున్న ఆదివారాలు, సోమవారాలు వేలాధి మంది వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నామన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సిఐ వైకుంఠరావు ఆధ్వర్యంలో అప్రమత్తంగా ఉన్నామన్నారు.


తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

చిట్టి గురువులను విజయవంతం చేయండి

మెరక ముడిదాం: మండలంలో నిరక్ష రాస్యులుగా ఎవరూ ఉండ కూడదనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న చిట్టి గురువులు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎంపిడిఒ పి. రామకృష్ణ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో జరిగిన సచివాలయం సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం విజయవంతానిక అందరూ కృషి చేయాలన్నారు. సిబ్బంది అందరు విధులకు హాజరైయేటపుడు, వెళ్లే టపుడు తప్పనిసరిగా బయో మెట్రిక్ వేయాలని, అలాంటిది ఎక్కడ జరగటం లేదని, దానికి ముఖ్యంగా ఆయా పంచాయతీ సెక్రటరీలు బాధ్యత వహించాలని చెప్పారు. సచివాలయంలో వాలంటీర్లు సరిగా సమయం పాటించడంలేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రతి ఆదివారమూ సీక్రేటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు విధులకు హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో ఎంఇఒ పి. రామారావు మాట్లాడుతూ మండలంలో 4100 మంది నిరక్ష రాస్యులున్నారని చెప్పారు. వారిని అక్షరాస్యులుగా తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ఈ నెల 13వ తారీఖున ఆయా సచివాలయం పరిధిలో ఉన్న నిరక్ష రాస్యులను అక్ష రాస్యులుగా తీర్చి దిద్దటానికి చిట్టి గురువులు కార్యక్రమం ద్వారా పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. దానికి ఆయా గ్రామ వాలంటీర్లు బాధ్యత వహించాలని, ఆ పరీక్షలో 50మార్కులకు గాను 30 మార్కులు సాధిస్తే మూడవ తరగతికి అర్హత సాధిస్తారని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రామకృష్ణ

గెడ్డ పోరంబోకు స్థలం ఆక్రమణకు యత్నం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చోడమ్మ అగ్రహారం పంచాయతీలోని పోరాంలో గెడ్డ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించేందుకు మంగళవారం ఓ వ్యాపారి పెన్సింగ్ పోల్‌లు వేయించాడు. విషయం తెలుసుకున్న గ్రామ రెవెన్యూ అధికారి షేక్ గౌష్ అడ్డుకున్నారు. గెడ్డపోరంబోకు స్థలంలో ఎందుకు పెన్సింగ్ వేస్తున్నారని ప్రశ్నించారు. బరంపురంకు చెందిన గోపాలరావుది ఈ స్థలమని వారు తెలిపారు. ఈ గెడ్డ పక్కన తమ గోదాం ఉందని తెలిపారు. దాంతో ఆమె మీ స్థలమైతే సర్వే చేయించుకోవాలన్నారు. సర్వేలో మీ స్థలం అని వస్తే అప్పుడు పోల్స్ వేయించుకోవాలని, తనకు తెలిసీ ఇది గెడ్డ పోరంబోకని చెప్పారు. వెంటనే మీరు పని ఆపాలని చెప్పడంతో వారంతా వెనుదిరిగారు. గోదాంకు కన్వర్షన్ కూడా కట్టలేదని, వెంటనే కట్టాలని తెలిపారు. సర్వే అయిన వరకూ పనులు చేయొద్దని తెలిపారు. అయితే పోరాం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 29/19లో 1.80 ఎకరాలు, సర్వేనెంబర్ 29/20లో 0.26 సెంట్లు బరంపురానికి చెందిన గోపాలకృష్ణదని, ఆ పక్కన ఉన్నదంతా గెడ్డ పోరంబోకని స్థానికులు కూడా చెబుతున్నారు. అయితే అక్కడ ఉన్న గోదాం కూడా రహదారిపైకి వచ్చి కట్టేసారని స్థానికలు ఆరోపిస్తున్నారు. సర్వే చేస్తే అసలు విషయం బయటపడుతుందని గ్రామస్థులు చెబుతున్నారు.

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు


ఆక్రమణలను అడ్డుకుంటున్న విఆర్ఒ షేక్ గౌష్

బంగారమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

డెంకాడ: మండలంలోని మోదవలస గ్రామ దేవత బంగారమ్మ తల్లి పండగ సందర్భంగా నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సతీసమేతంగా అమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. పసుపు, కుంకములు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, రాష్ట్ర నాగవంశం డైరెక్టర్ బోని అప్పలనాయుడు, వైసిపి సీనియర్ నాయకులు కనకల రామకృష్ణ తదితరులున్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

క్రికెట్ లెజెండ్ కపిల్ దేవ్‌కు బొబ్బిలి వీణ బహూకరణ

బొబ్బిలి : 1983లో క్రికెట్ ప్రపంచ కప్‌ను భారత్‌కు అందించిన క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్‌ను బొబ్బిలి రోటరీ క్లబ్ ప్రతినిధులు కలిసే అవకాశాన్ని ఆర్‌పిఎల్ నిర్వహకులు కల్పించారు. రోటరీ ఆధ్వర్యంలో రోటరీ ప్రీమియర్ లీగ్ పోటీలు విశాఖపట్నంలోని వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో 5,6, 7 తేదీల్లో జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి వాల్తేర్ క్లబ్ లో నిర్వహించిన ముగింపు వేడుకలకు ముఖ్య అధితిగా విచ్చేసిన ప్రముఖ క్రికెటర్ కపిల్ దేవ్‌ను బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జె సి రాజు, అసిస్టెంట్ గవర్నర్ తూముల కార్తిక్, సర్వీస్ ప్రాజెక్ట్ చైర్ శ్రీనివాసరావు, మెంబెర్ షిప్ చైర్ చంద్ర కిషోర్, ఫౌండేషన్ చైర్ సిహెచ్‌జె ప్రవీణ్ కుమార్, కార్యదర్శి శ్రీ హరి, కోశాధికారి శ్రీనివాసన్ కలిసి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన బొబ్బిలి వీణను బహుకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జె సి రాజు బొబ్బిలి వీణ ప్రాధాన్యతను కపిల్‌దేవ్‌కు వివరించారు. క్రికెట్‌లో విజేతగా నిలిచిన బొబ్బిలి రోటరీ క్రీడాకారులనుఆయన అభినందించారు.


కపిల్ దేవ్‌కు వీణను బహూకరిస్తున్న రోటరీ ప్రతినిధులు